క్లుప్తంగా

21 నుంచి మద్దిలేటయ్య క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు



ఉత్సవాలపై నిర్వహణపై చర్చిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ,ఆలయ ఈఓ, చైర్మన్

బేతంచెర్ల: మండల పరిధిలోని శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు ముక్కోటి ఏకాదశి(వైకుంఠ ఏకాదశి) ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. గురువారం ఆలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఈఓ, చైర్మన్ పాలక మండలి సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు కల్పించే సౌకర్యాలు, క్యూలైన్లు, అత్యవసర వైద్య సేవలు, రవాణా సౌకర్యము, అన్నదానం, శానిటేషన్, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై చర్చించారు.

ఐకమత్యంగా మెలగాలి



స్వామివార్లను దర్శించుకుంటున్న చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: గ్రామస్తులందరూ ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పిక్కర్లపల్లి తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ ఆదిపరాశక్తి, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి హాజరవ్వగా పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శివారెడ్డి, పిక్కర్లపల్లి తండా గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని పండ్ల తోటల సాగు ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందాలని ఉపాధి పథకం జిల్లా అంబుడ్స్‌పర్సన్ సురేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం బెలుం శింగవరంలో రైతు రాముడి నిమ్మతోటను పరిశీలించారు. సాగు వివరాలు, ఏటా ఆదాయ, వ్యయం తదితర విషయాలను రైతును అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కూలీలకు కొలతల ఆధారంగా రూ.272 వేతనం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని వల్లంపాడు, చిన్నకొప్పెర్ల గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఆయా గ్రామాల్లో మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చేందుకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాధిక, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గార్లపాటి జగదీశ్వరరెడ్డి, పద్మావతమ్మ, డాక్టర్ విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, వ్యవసాయాధికారి నిరంజన్, ఏపీఎం గురుస్వామి, ఉపాధి పథక ఏపీఓ శ్రీవిద్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల: కర్నూల్లో జరిగిన సౌత్ ఇండియన్ కరాటే ఛాంపియన్స్ గేమ్‌లో ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు మధు భార్గవి, పరిమళ అత్యుత్తమ ప్రతిభ కనభరిచి సిల్వర్, బ్రాంచ్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ మరియదాసు, అధ్యాపకులు విద్యార్థులను గురువారం అభినందించారు.

వాహనాల తనిఖీ

ప్యాపిలి: పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహన చోదకులను గుర్తించి వారికి రూ. 37 వేలు జరిమానా విధించారు. అనంతరం ఆయన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

రూ. లక్ష ఆదాయం

డోన్ టౌన్ : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయగా రూ.1,05,840 ఆదాయం వచ్చినట్లు పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో నిర్వహించిన వేలం పాటల్లో నాలుగు వాహనాలు అమ్ముడుపోయినట్లు ఆయన తెలిపారు.

ఆర్బీకేలు.. అన్నదాత నేస్తాలు !

- స్వగ్రామంలోనే అన్నదాతకు అందుతున్న వ్యవసాయ సేవలు
- పెట్టుబడి సాయం నుంచి దిగుబడుల విక్రయం వరకు అండగా నిలుస్తున్న ఆర్బీకే సిబ్బంది
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు (ఫైల్)



ఆర్బీకేలో కియోస్క్ ద్వారా రైతులకు సేవలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

డోన్ రూరల్ : వ్యవసాయ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. అన్నదాతకు అన్నివిధాలుగా అండగా నిలుస్తుంది. పెట్టుబడి సాయం నుంచి పంటల దిగుబడుల అమ్మకాల వరకు రైతన్నకు చేదోడుగా నిలుస్తుంది ప్రభుత్వం. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం సచివాలయాలకు అనుగుణంగా రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పింది. మండల కేంద్రాలకు ఏ రైతు వెళ్లకుండా వ్యవసాయానికి సంబంధించి సకలం గ్రామాల్లోనే అందేలా ఏర్పాటు చేసిన ఆర్బీకేలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ఇంకో విధంగా చెప్పాలంటే ఆర్బీకేలు అన్నదాతల నేస్తాలు పేరొంతులున్నాయి. డోన్ మండలానికి 20 రైతుభరోసా కేంద్రాలను మంజూరు చేసిన ప్రభుత్వం ఒక్కో భవన నిర్మాణానికి రూ.21.98లక్షలు కేటాయించింది. ఇప్పటికే 18 ఆర్బీకే నూతన భవనాల్లో రైతులకు సేవలు అందుతున్నాయి. రైతులు తమకు వీలున్న సమయంలోనే రైతుభరోసా కేంద్రానికి తమ సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. మండల కేంద్రానికి వెళ్లకుండానే ప్రతి సేవ స్వగ్రామంలోనే అందుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్బీకేలలో సర్వ సేవలు

రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతులకు కావాల్సిన సర్వ సేవలు అందుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంట నమోదు, ఈకేవైసీ, ధ్రువీకరణ ప్రతాల జారీ తదితర వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలు అందుతున్నాయి. విత్తన, మట్టి నమూనా పరీక్షలు లభిసున్నాయి. వ్యసాయ యాంత్రికరణలో భాగంగా రైతులకు సబ్సిడీపై యంత్రాలు, పనిముట్లు అందజేస్తూ ఆర్బీకే సిబ్బంది అండగా నిలుస్తున్నారు. సీజన్ మేరకు ఏ పంటలు సాగు చేయాలి, ఎప్పుడు విత్తనాలు విత్తాలి తదితర సలహాలను ఆర్బీకే సిబ్బంది ఎప్పకప్పుడు అందజేస్తూ అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా పంటలకు పురుగులు ఆశించినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలు, వాడాల్సిన పురుగు మందుల వివరాలు తెలుపుతున్న ఆర్బీకే సిబ్బంది రైతులకు నేస్తాలుగా మారారు. వాట్సప్ గ్రూపుల్లోనూ వ్యవసాయానికి సంబంధించిన సమాచారం, వాతావరణ సూచనలు వివరిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు ఆర్బీకే సిబ్బంది.

టీడీపీ ప్రభుత్వంలో విత్తనాల కోసం పడిగాపులు

గత టీడీపీ ప్రభుత్వంలో విత్తనాల కోసం పడిగాలపులు పడాల్సిన పరిస్థితి. మండల కేంద్రాలకు వెళ్లి నిరీక్షించినా కచ్చితంగా అందుతాయన్న నమ్మకం ఉండేది కాదు. విసుగుచెందిన రైతులు రాస్తారాకోలు, ధర్నాలు చేసిన సందర్భాలు కోకొల్లలు. పోలీసులు సైతం తమ లాఠీలతో రైతులపై ప్రతాపం చూపిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆర్బీకేలో సంప్రదిస్తే సకలం మన ముంగిటకే వస్తున్నాయి. కియోస్క్ యంత్రంలో రైతులు నేరుగా బుక్ చేసుకుంటే చాలు విత్తనాలు, ఎరువులు ఇలా వచ్చేస్తున్నాయి. దీంతో రైతన్న వ్యవసాయాన్ని పండుగా చేసుకుంటున్నాడు.

ఆర్బీకేలో అన్ని రకాల సేవలు



రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయానికి సంబంధించి అన్ని సేవలు అందజేస్తున్నాం. సీజన్‌ల మేరకు రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుతున్నాం. అదేవిధంగా సాగుకు సంబంధించి సూచనలు చేస్తూ రైతులను చైతన్య పరుస్తున్నాం. ఆర్బీకేల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– అబ్దుల్‌షఫీ, మండల వ్యవసాయ అధికారి, డోన్

సాగు కష్టాలు తీరాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సాగు కష్టాలు దాదాపు తీరుతున్నాయి. గతంలో విత్తనాలు, ఎరువుకు తీవ్ర ఇబ్బందులు పడ్డాం. రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో ఆ సమస్యలు తీరాయి. ఆర్బీకు ఉద్యోగులు చాలా సహకారం అందజేస్తున్నారు. విత్తన నుంచి దిగుబడుల విక్రయం వరకు సంపూర్ణ సహకారం అందజేస్తున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఓబులేష్, లక్ష్మంపల్లి, డోన్ మండలం

వినియోగదారులు కోర్టును ఆశ్రయించవచ్చు

- జడ్జి తంగమణి



పోస్టర్లను విడుదల చేస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్ : ఏదైన వస్తువు సేవలో లోపం ఏర్పడి వినియోగదారులు నష్టపోతే కన్జ్యూమర్ ఫోరంను ఆశ్రయించ వచ్చు అని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. వినియోగదారుల మాసోత్సవాల్లో భాగంగా గురువారం సబ్ కోర్టు వద్ద జడ్జి వినియోగదారుల పరిరక్షణ చైతన్యం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు నష్ట పోయినప్పుడు న్యాయవాది లేకుండానే కోర్టులో కేసు వేయవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదేలు కానాల మహేష్, మద్దిలేటి, డోన్ తాలూక వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు, సభ్యులు మస్తానయ్య, ధనుంజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

డోన్ టౌన్ : డోన్ డివిజన్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్థానిక మెస్సీయో ప్రార్థన మందిరంలో పాస్టర్ నిత్యానందం ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలతో పాటు ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాస్టన్ నిత్యానందంను సత్కరించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సీఐ రామానుజులు

కోవెలకుంట్ల: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ రామానుజులు సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ మోసగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి ఖాతాల్లో నగదును దోచుకుంటున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు మీ బంధువులు, స్నేహితుల పేరుతో అర్జంట్‌గా డబ్బులు కావాలని అడుగుతూ మెసెజ్ చేస్తే ఫోన్‌కాల్ చేసి నిజమా కాదా అని నిర్ధారించుకోవాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ అనేది మనం స్కాన్ చేస్తున్నామంటే పేమెంట్ చేయడానికి మాత్రమే అని గమనించాలని పేర్కొన్నారు. ఎవరైనా క్యూఆర్ కోడ్ పంపించి మీకు డబ్బులు పంపిస్తామని అంటే అది ఖచ్చితంగా మోసమని గుర్తించాలన్నారు. అపరిచితులతో చాటింగ్ చేసే సమయంలో మీ పేరు, అకౌంట్ నంబర్, పాన్, ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్లు తదితర వివరాలు చెప్పకూడదన్నారు. సైబర్ నేరగాళ్లు తాము విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ క్లస్టర్ పరిధిలోని కుటుంబాల వివరాలు, ఫోన్‌నంబర్లు తెలియ జేయాలని అడుగుతుంటారని, అలాంటి కాల్స్‌పైనా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫేక్‌బుక్ ద్వారా వచ్చే రిక్వెస్టులు, ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు, లోన్ యాప్స్, లోన్ మంజూరు కాల్స్, ఉచిత గిఫ్టలు, సోషల్ మీడియాలో కొత్త పరిచయాలు, తదితర అంశాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించారు.

మహిళల అభివృద్ధికి సహకారం



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న రామ్‌కో ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు

కొలిమిగుండ్ల: సామాజిక బాధ్యత కింద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని రామ్‌కో సిమెంట్ కంపెనీ యూనిట్ హెడ్ రెడ్డినాగరాజు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా కొలిమిగుండ్ల, కల్వటాల, ఇటిక్యాల, కనకాద్రిపల్లె, నాయినపల్లె, పెట్నికోట గ్రామాలకు చెందిన చెందిన 45 మంది మహిళలకు ముగ్గం వర్క్‌పై మూడు నెలల పాటు ఇచ్చిన శిక్షణ గురువారం ముగిసింది. ఈ మేరకు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా రెడ్డి నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ 18 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రాంలో భాగంగా 30 మంది మహిళలకు శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, జనరల్ మేనేజర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

బనగానపల్లె రూరల్ : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వాహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి పెట్రోల్‌బంకు, ఎంపీడీఓ కార్యాలయం, ఆస్థానం రోడ్డు మీదుగా సాగింది. అంతకుముందు వారు మాట్లాడుతూ ఓటు పౌరులకు వజ్రాయుధం వంటిదని ప్రతిఒక్కరూ కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఓ రాఘవేంద్రప్రసాద్, వీఆర్‌ఓలు సురేంద్రబాబు, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్, సురేష్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మదార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పువ్వులు, ఆకులు ఉపయోగకరం



మాట్లాడుతున్న అధ్యాపకురాలు వసుందరమ్మ

బనగానపల్లె రూరల్ : ప్రకృతిలో లభించే పలు రకాల పువ్వులు, ఆకులు సైతం మానవ జీవన శైలికి ఎంతో ఉపయోగపడుతాయని వృక్షాశాస్త్ర అధ్యాపకురాలు వసుందరమ్మ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాబునాథ్ అధ్యక్షతన కళాశాల వృక్షాశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలు, పువ్వులపై చిత్ర ప్రదర్శన (ఎగ్జిబిషన్) ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందర పువ్వు రక్తపోటు తగ్గిండంలో సహాయపడే టీకాలలో విరివిగా వినియోగిస్తారన్నారు. పలు రకాల పువ్వులు ఆయుర్వేద ఔషధాల్లో చర్మవ్యాధులు, గాయాలు వంటి వివిధ రోగాలకు వినియోగిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కౌసల్య, వహీదా, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, నాగరాజు, రవి కుమార్, రామన్న సయ్యద్ తదితర కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సంతోషంగా ప్రజలు



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ రూరల్ : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ గ్రామానికి ఇంత వరకు ఎవ్వరూ వేయని విధంగా డబుల్ రోడ్డు వేయించిన ఘనత మంత్రి బుగ్గన్నకే దక్కుతుందన్నారు. అలాగే రూ. 10కోట్లతో అబ్బిరెడ్డిపల్లి చెరువు అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, సర్పంచ్ బోయ రాణి, ఎంపీటీసీ రామాలక్ష్మి, గ్రామ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గట్టు సుంకన్న పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బనగానపల్లె : సీఎం జగన్ పాలనలో పార్టీలు కులాలు మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీహరిత అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గద్దం నాగేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, చక్రపాణిరెడ్డి, రామేశ్వరరెడ్డి, రాజశేఖర్, బాలవెంకట ఎంఎల్‌ఓ మధుసూదాకర్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా పోలీసులు

- పోలీస్ స్టేషన్‌కు ఎప్పుడైనా రావచ్చు
- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ రూరల్ : పోలీసులు బాధితులకు ఎల్లప్పుడు అండగా ఉంటారని, న్యాయం చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా ఎప్పుడైనా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో గురువారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో డీఎస్పీ సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. డీఎస్పీ మాట్లాడుతూ చనుగొండ్లలో ఒకప్పుడు ఫ్యాక్షన్ ఉండేదని, ప్రస్తుతం ఐకమత్యంగా మెలుగుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఫ్యాక్షన్ వీడితే ప్రజల బాంధవ్యాలు ఎలా ఉంటాయనేది ఇక్కడ చూస్తున్నామన్నారు. ఫ్యాక్షన్ ఉన్నప్పటి పరిస్థితులు, లేనప్పటి పరిస్థితులను ప్రతిఒక్కరూ గమనించాలని సూచించారు. ఇదే పద్ధతిని కొనసాగించాలని, గ్రామాన్ని ఇంకా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని, గ్రామస్తులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సామరస్యంగా రాజకీయాలు ఉండాలే తప్పా ఎప్పటికీ వ్యక్తిగతంగా తీసుకోవద్దని, గ్రామాభివృద్ధికి ఐకమత్యంగా పాటుపడాలని ఈ సందర్భంగా డీఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డోన్ చేరిన పాదయాత్ర



బసవరాజుకు స్వాగతం పలుకుతున్న డోన్ నాయికులు

డోన్ టౌన్ : గుంటూరుకు జిల్లా మంగళగిరికి చెందిన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ సభ్యులు కట్టపోగు బసవరాజు 175కి 175 స్థానాలు గెలిపించాలని కోరుతూ ఇడుపులయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర గురువారం డోన్‌కు చేరుకుంది. వెంకటాపురం రోడ్డులో వైయస్సార్‌సీపీ సర్కిల్ వద్ద డోన్ వెస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ అనే అంశంపై వివరణ ఇచ్చారు. కరోనా కష్ట కాలంలోనూ రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వైరస్ వ్యాప్తి చెందకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పకడ్బందీగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం జగనన్నను ప్రజలు మరోమారు ఆశీర్వాదిస్తారని ఆయన చెప్పారు. అనంతరం ప్యాపిలికి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్‌గౌడ్, జాకీర్, మదన్, రంగస్వామి, ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ప్యాపిలి జట్టు

సంజామల: మండల పరిధిలో ఆల్వకొండ క్రాస్ వద్ద వెలసిన కాశీరెడ్డి నాయన ఆశ్రమం 28వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి పోటీల్లో 24 జట్లు పాల్గొన్నగా ప్యాపిలి జట్టు ప్రథమ స్థానం నిలిచి రూ.10 వేలు కైవసం చేసుకుంది. దొర్నిపాటు మండలం చాకరాజువేములు గ్రామానికి చెందిన జట్టు రెండవ బహుమతి రూ.5 వేలు కైవసం చేసుకుంది. కొలిమిగుండ్ల మండలం పెట్నికోట జట్టు మూడవ బహుమతి రూ.3 వేలు, ఆళ్ళగడ్డ జట్టు నాల్గువ స్థానంలో నిలిచి రూ. వెయ్యి కై వసం చేసుకున్నాయి. ఈ మేరకు గురువారం గెలుపొందిన జట్లకు నిర్వాహకులు దారెడ్డి సుధాకర్ రెడ్డి, వైస్ ఖాశీం బహుమతులు అందజేశారు.

మాదిగల కురుక్షేత్ర మహా సంగ్రామ పోస్టర్ల విడుదల

కొలిమిగుండ్ల: ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీల్లో ఢిల్లీలో తలపెట్టిన మాదిగల కురుక్షేత్ర మహాసంగ్రామ ధర్నా పోస్టర్లను గురువారం నాయకులతో కలిసి మండల అధ్యక్షుడు క్రిష్ణయ్య విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని క్రిష్ణయ్య డిమాండ్ చేశారు. కురుక్షేత్ర మహాసంగ్రామ ధర్నాకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధిని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చల్లా మాట్లాడుతూ అవుకు మండలంలోని కింది గ్రామాల్లో వర్షాలు కురిసి, కొండమీది గ్రామాల్లో వర్షాలు కురవని సందర్భాల్లో వర్షపాతం నమోదును మండలం మొత్తం తీసుకుంటున్నారని, ప్రక్రియ న్యాయం కాదన్నారు. కొండమీది గ్రామాల ప్రజలు ప్రభుత్వం నుంచి అందే లబ్ధిని పొందలేకపోతున్నారని, అధికారుల ఈ విషయాన్ని గుర్తించి వ్యవహరించాలని ఆదేశించారు. కొండమీది గ్రామాలైన ఉప్పలపాడు, కునుకుంట్ల, జూనూతల, కొండమనాయునిపల్లె, ఇస్రానాయక్ తాండా, పిక్కళ్ల పల్లితాండా, మారెమడుగుల, మర్రికుంట తాండా, మన్నేనాయక్ తాండాలకు సంబంధించి వర్షపాతం నమోదును ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. బడిఈడు పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. బుడగజంగాల పిల్లలకు ఆధార్ కార్డులు మంజూరు చేసి, వారిని బడికి పంపేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ ఉసేన్ మియా, ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసాద్ బాబు, ఆర్‌అండ్‌డీ డీఈ సుధాకర్, డాక్టర్ యమున, ఏఓ అబ్దుల్ హక్, ఈఓఆర్డీ రామ కృష్ణవేణి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వెంకటరమణ, కరిముల్లా, ఏపీఓ అనీఫా, ఎంఈఓ శ్రీధర్ రావు, ఏపీఎం విజయగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో మెరుగైన వైద్య సేవలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన

బేతంచెర్ల: గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో ఎంపీటీసీ రామ చంద్రారెడ్డి, వైద్యులు భార్గవి, అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎంపీపీ, చైర్మన్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు ప్రజా సంక్షేమంతో పాటు విద్య, వైద్య రంగాలకు సీఎం అందిస్తున్న తోడ్పాటును వివరించారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు గుని నాగరాజు, పాపసాని చంద్రశేఖర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.